# కనిపించని చెయ్యి

నా చందమామ, కొండార కోట, బండరాయి అత్మకథ.....
ఇంకా
పద్నాలుగు
కథలు

హెచ్చార్కె



**KANIPINCHANI CHEYYI**
**mari konni kathalu**
an anthology of short stories by
**HRK**
**hrkkodidela@gmail.com**
© Writer
Cover Design : **Anwar**
First Edition : November, 2016 Copies : 1000
For Copies :
Visalaandhra Book House, Prajasakti Book House,
Navodaya Book House. e book @ kinige.com
DTP, Title, Layout, Printing:
CHINUKU Publications
Gandhinagar, Vijayawada - 520 003,
Cell : 98481 32208
**Rs.130/-**

## ఇకపై పేజీల్లో.....


| | |
|---|---|
| *1.* నా చందమామ | *11* |
| *2.* చేతికి రాని కొడుకు | *14* |
| *3.* బచ్చా బ్యారక్ | *21* |
| *4.* కనిపించని చెయ్యి | *28* |
| *5.* బండరాయి ఆత్మకథ | *37* |
| *6.* కొండార కోట | *45* |
| *7.* అల్ ఫతా హోటల్ | *53* |
| *8.* కుక్క బతుకు | *61* |
| *9.* దయ్యం | *66* |
| *10.* ఎండ | *82* |
| *11.* దూరం | *91* |
| *12.* కల కాదు | *100* |
| *13.* వేట కుక్క | *108* |
| *14.* చీకటి | *120* |
| *15.* ఐపు | *129* |
| *16.* క్షమ | *137* |
| *17.* ఒక్కోసారి | *145* |
| *18.* పిచ్చివాని డైరీ | *152* |

# చేతికి రాని కొడుకు

**మద్దిలేటి** వాగు దాటినాక టాక్సీ ఆగింది. డ్రైవరు పక్కన కూర్చున్న నన్ను దిగమన్నారెవరో. వెనుక సీట్లోంచి తమ్ముడు, అమ్మ కూడా దిగారు.

అప్పటికే మా ఎద్దుల బండి వచ్చి వుంది. నాన్న చాల ఇష్టపడి కొనుక్కున్న ఒంగోలు గిత్తలు. తాము అక్కడికి వచ్చింది ఎందుకో తెలియని మూగజీవాలు. ఆ చల్లని పొద్దుటి గాలికి ఇష్టంగా నిలబడి వున్నాయి. కాస్త పసుపు కలిసిన మీగడ రంగులో చిత్రంగా మెరుస్తున్నాయి.

టాక్సీ డిక్కీలో ముడుచుకుని పడుకున్న నాన్నను జాగర్తగా తీసి, ఎద్దుల బండి మీద పడుకోబెట్టారు. అమ్మను బండి మీద నాన్న కాళ్ల దగ్గర కూర్చోమన్నారు.

నేను, తమ్ముడు, ఇంటినుంచి వచ్చిన ఇద్దరు తమ్ముళ్లు, చిన్నాన్నలు, మామలు బండి వెంట నడిచాం.

తొలకరి వానల కాలం. పెద్ద బజారులో రాత్రి కురిసిన వాన, బురద. చిన్న చిన్న కాల్వలుగా పారుతున్న వాన నీళ్లు. అప్పడప్పుడే వూరిని కావిలించుకుంటున్న చల్లని ఎండ.

బండి మీద నాన్న కాళ్ల దగ్గర, తల మీద కొంగు కప్పుకుని

బాగా మాసిపోయి పగుళ్లు వారిన పెళ్లికూతురు బొమ్మలా అమ్మ.

ఊరిని సగం అటు సగం ఇటు విడదీస్తూ అంత పొడవైన బజారు బహుశా ఇంకే వూరికీ వుండదు. మసీదు, వీరభద్రుని దేవాలయం, గ్రామ కచేరీ, ముఖ్యమైన అంగళ్లు, బందెల దొడ్డి, పీర్ల చావిడి, జెండా మాను, రాత్రులు వూరి యువకులు భజనకు చేరే రాముల్దేవళం. హరికథలు, బుర్రకథలు చెప్పే మఠం అరుగులు, పంచాయతీలకు పెద్ద మనుషులు కూర్చునే రచ్చబండ...అన్నీ ఆ బజారులోనే వుంటాయి. వాగు ఒడ్డున చెలిమల దగ్గర కడవలు పెట్టుకుని తమ వంతు మంచినీళ్ల కోసం కూర్చున్న వాళ్లు మా వైపు సానుభూతిగా చూశారు.

బజారుకు ఈ చివర వాగు ఒడ్డయితే ఆ చివర మా నెరవాటి రెడ్ల ఇండ్లు.

బండి బయల్దేరింది. బురదలో మెత్తగా దొర్లుతున్న బండి గాన్ల చప్పుడు. అప్పుడప్పుడు ఎద్దుల మెడ గంటల చప్పుడు. అంతే. బజారు పొడవునా బరువైన మౌనం. ఎవరూ మాట్లాడలేదు. మాట్లాడినా నాకు వినిపించలేదు.

బండి మీద పడుకున్న నాన్నను, నాన్న కాళ్ల దగ్గర తలొంచుకుని కూర్చున్న అమ్మను చూస్తూ ఏం జరుగుతున్నదో అర్థం చేసుకోడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ నడిచాను.

ఇపుడు ఇన్నేళ్ల తరువాత సరే. అప్పుడు ఆ ఉదయం నా మనస్సులో ఏదీ అందని అగాథం. అంతా అస్పష్టం. అర్థ రహితం.

బండి ఇల్లు చేరింది. నాన్నను బండిమీంచి దించి ఇంటి ముంగిటి వారపాకు కింద పడుకోబెట్టారు. తలాపున దీపం పెట్టారు. ఎందుకు దీపం? తెల్లగా తెల్లారాక ఇంకా ఎందుకు దీపం అనిపించిందొక్క క్షణం. పుట్టిన వెంటనే చనిపోయిన ప్రశ్న.

కాసేపటికి వారపాకు బయట బజారుకు దగ్గరగా నులక మంచం వేశారు. నాన్నను తెచ్చి మంచం మీద కూర్చోబెట్టారు. ధోవతి అలాగేవుంచి, అంగీ తీసేశారు. ఒల్లు రుద్దుతూ నీళ్లు పోశారు.

ఎక్కడా కొవ్వు కనిపించని బక్క పల్చని శరీరం. ఎముకల మీద చర్మమే గాని కండలు లేవనిపించేంత పల్చని చెంపల కోల ముఖం. మా నాన్న అని కాదు గాని అంత చక్కని ముక్కుని నేను మరెవరి ముఖంలో చూళ్లేదు. రోజూ పొద్దున్నే సేద్యానికి బయల్దేరుతూ పగ్గాలతో గుంటకకు కాడిమాను కట్టి దానికి మేడితోక బిగించి కోటేరు వేస్తున్నప్పుడు ఆయన చూపించే శ్రద్ధ నన్ను ఆశ్చర్య పరిచేది. అదిగో ఆ కోటేరులాగే వుంటుంది ఆయన ముక్కు. పెన్సిల్తో గీసినట్టున్న కనబొమల కింద కుడి కంటిమీద పడుతున్న ముంగురులు. అప్పటికి ఆయనకు యాభై ఏండ్లు వుండీ లేక. నుదుటి మీద కొన్ని గీతలు తప్ప శరీరంలో ఎక్కడా ముడుతలు లేవు.

నాన్న ముఖంలో అంత ప్రశాంతిని నేనెప్పుడూ చూళ్లేదు. కళ్లు మూసి వున్నాయి. ఆయన కళ్లలో ఎప్పుడూ కనిపించే ఎర్ర జీర అప్పుడు వుండి వుండదు.

# కనిపించని చెయ్యి

**మధును** మరిచి పోవడం కృష్ణారావుకు అసాధ్యం.

మధు ఒక పచ్చి గాయం.

మధు లేడు.

మెత్తని మాటల, ఎర్రని పెదిమల, బంగారు గొలుసుల, సఫారి దుస్తుల, ఇద్దరు భార్యల, నలుగురు కొడుకుల, చాల మంది మిత్రుల, తుమ్మెద ప్రేమల, అంతులేని ఆశల, లెక్కల బుక్కుల మధు.

మధు లేడు. ఎక్కడో ఉన్నాడు. ఎక్కడా లేడు.

రెన్నెళ్ల క్రితం ఆఫీసుకు వచ్చి టేబుల్‌కు అటువైపు కూర్చుని మధు మాట్లాడుతున్న దృశ్యం కృష్ణారావు కనుపాపల్లో తాపడం చేసినట్లుంది. లోక రీతుల గురించి తనకు తెలియని వెన్నో సంగతులు చెప్పాడు. అవన్నీ అతడికెలా తెలుస్తాయి, తనకెందుకు తెలియవని ఎప్పట్లాగే ఆశ్చర్యపోయాడు కృష్ణారావు.

ఆ మాటల మూట మధు ఇప్పుడు లేడు.

అతి సామాన్య వాక్యం. సంక్లిష్టత ఏమీ లేదు. మధు లేడు.

కృష్ణారావుకు మధు నగరమిచ్చిన స్నేహితుడు కాదు. బాల్య మిత్రుడు. తన ఊరి వాడు.

చదువుకున్నది వేర్వేరు కాలేజీల్లోనయినా, సెలవులకు వూరికి వెళ్లినప్పుడల్లా కాలేజీ కబుర్లను, వాటికన్న ఎక్కువగా నెత్తి మీద డెమోకిల్స్ కత్తిలా వేలాడుతున్న నిరుద్యోగం దిగుళ్లను కృష్ణారావుతో పంచుకున్న వాడు.

నూనూగు మీసాల రోజుల్లో మసక చీకటి పడ్డాక ఏటి నుంచి నడుం మీద కడవను పాపాయిలా పట్టుకుని వచ్చే సొంత మరదలు తడి తడి పున్నమ్మను గోడల నీడల్లో ఆపి, ప్రేమిస్తున్నానని మత్తు మాటలు చల్లి, వేడి ముద్దులు కొట్టేసి కృష్ణారావును అబ్బుర పరచినవాడు. ఆ అమ్మాయి ఏటి ఒడ్డున దేవాలయం వెనక్కి పిలిస్తే రాలేదని తెగ విసుక్కున్నవాడు. బావా మరదళ్లు కదా పెళ్లి చేసుకోండని కృష్ణారావు రొమాంటిక్ ఊహలు చేయబోతే, సరె సర్లె ఈ చదువురాని గుదిబండమ్మతో ఏ యేట్లో దిగమంటావ్ అని నిరసనగా చూసి, ఆపైన కలలుగనే మంద్ర స్వరంతో లాభదాయక పెళ్ళిళ్ల గురించి తన అద్భుత అవగాహనను వివరించి కృష్ణారావును నిరుత్తరున్ని చేసిన బాల జ్ఞాని.

ఇక్కడ నగరంలో దూర దూరంగా వున్నా, అప్పుడప్పుడు అక్కడక్కడ కలుస్తూ బాల్య స్నేహాన్ని పునఃపునఃపునరుద్ధరించిన హితుడు. డబ్బును తేనెలా సేకరిస్తూ నగరాన్ని మరో రకం పూల తోటగా మార్చిన మధుపం మధు ఇప్పుడు లేడు.

అలా ఒక్కసారిగా మధు లేకపోవడాన్ని కృష్ణారావు జీర్ణించుకోలేకపోతున్నాడు.

కృష్ణారావు చిన్న చిన్న ఆర్థిక సమస్యలు మధుకు ఎలా తెలిసేవో ఏమో, తెలుసుకుని వచ్చి, వాటిని ఉభయ తారకంగా పరిష్కరించేవాడు. కృష్ణారావు పెద్ద కొడుకు ఇంటర్మీడియట్ అయిపోయి, ఎంసెట్‌లో పొడుగాటి ర్యాంకు వచ్చి, ఏదో దూరం కాలేజీలో చెల్లింపు సీటు దొరికి, అప్పటి తన మిగులు డబ్బును ఎలా లెక్క గట్టినా మొదటి ఏడాది ఫీజులోనే పెద్ద బొర్ర కనిపించి, దిక్కు తోచక దిగులు పడుతుంటే, గొడ్డలి పోగొట్టుకుని ఏడ్చే పేదవాడి కోసం బంగారు గొడ్డలి పట్టుకొచ్చిన వనదేవతలా, చెప్పా పెట్టకుండా ఆఫీసులో మధు ప్రత్యక్షమయ్యాడు. పిచ్చాపాటీ కబుర్లతో మొదలెట్టి, కృష్ణారావు తక్షణ సమస్యల్లోనికి దిగి పోయాడు.

“బయపడాకబ్బా, ఈ నెల ఒక పెద్ద చిట్టీలో ఖాళీ వచ్చింది. నీకు సరిగ్గా సరి పోతుంది. ఈ నెలతో మొదలెట్టు. ఇమ్మీడియట్‌గా డబ్బుల్లేకపోతే, మన్లో మనకేం, నేను కట్టేస్తాలే. నాకు మళ్లియ్యి. వచ్చేనెల చిట్టీపాడి అబ్బాయి ఫీజు కట్టెయ్” అన్నాడు, అభయ హస్తం ముందుకు చాచి.

“నెల నెలా డబ్బు కట్టడమంటే మాటలా? ఇంటి ఖర్చులు పోగా ఏమంత

# కొండార కోట

**"మా కొండారకోట** మన్నులు మొదట్నించి దొంగలే" అన్నాడు హనీఫ్.

ఆ మాటకు ఎవరైనా కోప్పడతారేమో అని చూశాను. పక్కన కూర్చున్న వాళ్లు హాయిగా నవ్వుతున్నారు.

"అనీఫ్ అంటొండేది ఇప్పుడు గాదులె, పూర్వ కాలం కత" అన్నాడు నాడెం పచ్చన్న, హనీఫ్‌కు తనకు మధ్య నుంచి ఒక గులక రాయి తీసి దూరంగా విసిరేస్తూ.

"పూర్వకాలమైనా, ఒక వూరి వాళ్లంతా దొంగలెట్లవుతారు. ఎవరో కొందరుంటారు" అన్నాన్నేను.

"వోబ్బో. వూరంతా దొంగలే. అసలు దొంగలు దెచ్చిన సొమ్ము ల్తోటే గద అటికం తిమ్మరాజు ఈ కోట గట్టింది" అన్నాడు హనీఫ్ మళ్లీ.

"కోట గట్టింది, మేంటేన్ జేసింది దొంగలు దెచ్చిన దుడ్లతోటే. దొంగలు కడాకరికి సాముల సొమ్ము గుడ్క ఇడ్సల్యా. ఈ కోట రాజు గుడ్క దొంగల్ని కనుక్కో ల్యాక పాయ. అట్టనే గద, కోటకు

కోట దుంప నాశినమయ్యిండేది" అన్నాడు వీళ్ళకు కొంచెం ఎడంగా కూర్చుని తొడ మీద తాడు పేనుకుంటున్న నల్ల బక్కన్న.

నేను వాళ్ల వైపు ఆసక్తిగా చూశాను. ఇక్కడ ఏదో మంచి కథే ఉన్నట్టుంది.

పల్లెటూళ్లకు వస్తే ఇదొక బోనస్. వచ్చిన పని అయినా కాకున్నా, విశాలంగా పరుచుకున్నట్లుండే చేలల్లో తిరగొచ్చు. గుండె నిండా ప్రాణవాయువు పోసుకోవచ్చు. పనుల్లేని కాలమయితే జనం కూర్చుని చెప్పే రకరకాల కబుర్లు వినొచ్చు.

నిజానికి, నేను మా సుజాతకు తోడుగా వచ్చానంతే. నాకంటూ పనేం లేదు.

సుజాత మా చెల్లెలు. పుస్తకాల పురుగు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయింది. యూనివర్సిటీలో ఏదో ఫెలోషిప్ సంపాదించి పరిశోధన చేస్తోంది.

ఇలా వూళ్లకు బయల్దేరే ముందు సుజాత నన్ను తోడు రమ్మంటే కాసేపు బెట్టు చేశాను. 'తాగబోతె నీళ్లుండవు. తినబోతే గొడ్డుకారం నేస్రాను సెల్లో రాళ్ల సీమ ఊళ్ళకైతే' అని పాట పాడి ఉడికించాను కూడా. అదంతా అర్ధమనస్కంగానే. ఊళ్లు తిరగడం నాక్కూడా ఇష్టమే. సుజాత రాయలసీమలో పాత కాలం కోటలు, అప్పటి రాజ్యాలు, స్థితిగతుల మీద పరిశోధన చేస్తోంది. పరిశోధనలో పేర్కొనే ప్రదేశాలు కొన్నైనా చూసి రావాలని ఆమె కోరిక. ప్రాజెక్టులో ప్రయాణాలకు తగిన ఫండ్స్ వున్నాయి. నా మాదిరి ఎవర్నైనా తోడు తీసుకు వెళ్ళడానికి ప్రొవిజన్ కూడా వుంది. నాకేమో సెలవులు పేరుకుపోయి వున్నాయి. వాడుకోకపోతే మురిగిపోతాయి. అలా చేరాం ఇక్కడికి అన్నా చెల్లెళ్లం. ఆ వూరి పేరే కోట. ఈ ప్రాంతంలో ఇలా చాల 'కోట'లుంటాయి. వేర్వేరుగా గుర్తించడం కోసం ప్రతి కోటకు ముందో వెనుకో ఒక పదం కలుపుతుంటారు. ఈ వూరి పేరు కొండార కోట. కొండార కోట అంటే కొండ వారన, కొండకు దగ్గరగా వున్న కోట అని అర్థం. ఊరంతా ఇప్పుడు కోటకు బయటే వుంటుంది.

పూర్వకాలం కోటలో కూడా జనం వుండేవారు. కోట పాడయ్యాక వాళ్లంతా కోట పక్కన పల్లెలో కలిసిపోయారు.

ఇప్పుడు కోటలో జనమే కాదు, ఇండ్లు కూడా లేవు. అక్కడక్కడ కొన్ని ఇండ్లు, దేవాలయాల శిధిలాలు కనిపిస్తాయి. కోటలో భూమినంతా చదును చేసి పొలాలు చేసుకున్నారు. ఒకప్పటి కోటగోడ చుట్టూ వుండిన కందకం, నాలుగైదు బురుజులు, వాటిని కలుపుతూ ఇంకా పడిపోని గోడలు, ఒక బురుజు మీద బాగా తుప్పు పట్టిన ఒక ఫిరంగి, వీటన్నిటికీ నేపథ్యంగా ఏవేవో చెట్లు.

సుజాత కెమెరా పట్టుకుని ఈ ఊరి వాడే ఒక పిల్లవాడితో మాట్లాడుతూ కందకం పక్కన దిబ్బల మీద తిరుగుతోంది. ఇళ్ల ముందు పరుచుకోడానికి, చేల గట్ల కోసం వూరి జనం ఎత్తుకుపోగా అక్కడక్కడ రాళ్లు మిగిలి వున్నాయి. అలాంటి ఒక రాళ్ల దిబ్బమీద కూర్చున్నాం హనీఫ్ వాళ్ళూ నేను.

"ఈమె రావడానికి చాలసేపు పడుతుందిలే. ఆ కథ చెప్పు. తమాషాగా వుండే

# దయ్యం

**అదొక** శీతాకాలం మధ్యాహ్నం.

సంక్రాంతి పండుగ దగ్గర పడుతోంది. అయినా, ఆ రోజెందుకో బాగా ఎండగా, వుక్కగా ఉంది.

నేను కాశిపేట చేనుకు వెళ్లి వస్తున్నాను.

సేద్యం పనుల మీద నా ఆసక్తి స్వల్పం. కాశిపేట చేనుకు వెళ్లి రావడానికి నా కారణాలు వేరు.

నాకు పగటి కలలంటే ఇష్టం. అవి నా మానసిక ఆహారం. కపాలంలో కలల పురుగులు తిరుగుతూ ఉండకపోతే, సమయానికి మందు దొరకని తాగుబోతులా లోపల గింజుకుంటాను. ప్రత్యేకమైన ధ్యేయం లేని నడక పగటి కలలకు మంచి మాధ్యమమని నేనేనాడో కనిపెట్టాను.

మా చేలన్నిట్లోకి కాశిపేట చేనే ఎక్కువ దూరం. అక్కడికి వెళ్లడానికీ తిరిగి రావడానికీ చాల సమయం పడుతుంది. సోమరి నడకకు బోలెడంత సమయం. ఎక్కడికి వెళ్లావని ఎవరైనా

పొరపాటున అడిగితే చెప్పుకోడానికి ఒక మంచి నెపం.

ఆ రోజు అలాగే పొలాల మధ్య కాలి బాట మీద తల వంచుకుని నడుస్తున్నాను.

"ఓ రాజన్నా" అని ఎవరో పక్క పొలం లోంచి కేకేశారు. సరిగ్గా గుర్తు లేదుగాని, ఏదో బంగారంలాంటి కలే, ముల్లు గుచ్చుకున్న రబ్బరు బుడగలా ఫట్‌మని పగిలిపోయింది. బహుశా అప్పుడు నేను ఏనాడూ చూసి వుండని మంచు కొండల మీద, నేనేనాడూ చేయని స్కేటింగ్ చేస్తూ వుండి వుంటాను. తెలిసినవీ అందుబాటులో వున్నవీ అయితే, ఇక వాటి గురించి కలలు కనడమెందుకు? పొలంలోంచి పిలుపు బంగారంలాంటి నా కల నుంచి బయటికి లాగేసింది.

అన్న అనేది నా పేరులో భాగం కాదు. నా పేరు రాజా రెడ్డి. దాన్ని సగానికి తుంచి ఆ పైన అన్నను అతికించి పిలిచారంటే ఎవరో ఆత్మీయులే. పిలుపులో ఆత్మీయతతో పాటు కొంచెం ఆదుర్దా కూడా వినిపించింది. సంగతేమిటా అని తలెత్తి, ఎండకు కళ్లు చికిలించాను.

కాలి బాట పక్కన ఎప్పటి నుంచో చూస్తున్న పంగల వేప చెట్టు, దాని మీద ఎప్పుడూ కనిపించే మంచెతో సహా. వేప చెట్టుకు అటువైపు మాదే మరో చేను. రేగడి చేను. అచ్చమైన నల్ల రేగడి నేల.

ఎరువులు వేసినా వేయక పోయినా బాగా పండుతుందని మా నాన్నకు ఆ చేనంటే వల్లమాలిన ప్రేమ. ఊరికి దగ్గరగా వుంటుంది, కలల నడకకు పనికిరాదని, నాకా చేను మీద చిన్న చూపు. రేగడి చేనులో ఆ ఏడాది వేరు శనగ వేశారు. పొలం పాయడం, వేరు శనగ కట్టె ఇంటికి తీసుకుపోవడం జరిగిపోయాయి. వేరు శనగ పంటలో అదొక రకం. చెట్టుకు ఒకటికి మించి వేళ్లుండి, చుట్టూరా పరుచుకుంటాయి. పీకితే ఒక పట్టాన పెగిలి రావు. చెట్లను పాసి (గుంటకతో పెకలించి) ఇంటికి తీసుకెళ్లి పోయినా, ఇంకా చాల వేరు శనక్కాయలు నేలలో ఉండిపోతాయి. తరువాత మరోసారి గుంటకతో బోజలు కొట్టి చేత్తో జాగర్తగా ఏరుకుంటే గాని పంట పూర్తిగా చేతికి రాదు. అప్పుడు మా రేగడి చేనిలో ఆ పనే జరుగుతోంది.

కేకేసిన మనిషి నా చిన్ననాటి స్నేహితుడు, వ్యవసాయ కూలీ కత్తి రాముడు. రాముడు బోజెలు కొట్టే గుంటక తోలుతున్నాడు. నేను తన వైపు నడవడం చూసి పగ్గాలు లాగి ఎద్దులను నిలబెట్టాడు. చేలో రాముడితో పాటు మరి కొంతమంది ఆడ వాళ్లూ మగవాళ్ళూ ఉన్నారు. వాళ్ళంతా అప్పటికే తయారయిన గుంటక చాళ్లలో చేనుకు అడ్డంగా ఒక వరుసలో కూర్చుని ఉన్నారు. ఒక చేత్తో పైకి తేలిన శనక్కాయల్ని ఏరి, నడుముకు కట్టుకున్న ఒడిలో వేసుకుంటున్నారు. ఆ వరుసలో మా అమ్మ కూడా ఉంది. అమ్మ తన దయ గల కళ్లతో ఒకసారి నా వైపు చూసి, వెంటనే తల వంచుకుని తన పనిలో పడి పోయింది.

"మరీ శాన నష్టమయ్యిందా?" రాముడు చేలోంచి అరిచాడు...ప్రశ్న స్పష్టంగా

# దూరం

**"ఆఁ,** యావయ్యయ్యు రూపాయ్లా..." పర్సు తీయడానికి జేబులో పెట్టిన చెయ్యిని అక్కడే వుంచి, చిరాగ్గా అడిగాను ఆటో డ్రైవర్ని.

"మీటరు చూస్కో", కండ్లు లేవా అనడం ఒకటే తక్కువ. దాదాపు అదే అర్థంలో చూశాడతను. నా మీద అరంగుళం ఎత్తుంటాడు. నా కన్న పుష్టిగా బలంగా వున్నాడు. యువకుడు. పేచీ పడితే అలాంటి మాటలే ఇంకేవో అనగలడు. పర్సు బయటికి తీశాను.

"ఇంటి కాన్నుంచి ఇమ్లిబన్ బస్టాండుకు ఎన్నిసార్లు రాలేదు? నలవయ్యయదు కన్న ఎక్కువ కాదు. ఇవేం మీటర్లో ఏమో..." అంటూ ఆటో దిగింది మా ఆవిడ, లక్ష్మి.

నేను చేత్తో పట్టుకున్న పర్సు వైపు చూస్తూ నాకూ ఆటో డ్రైవరుకు మధ్యగా దూరి ఉర్దూలో అడుక్కోవడం మొదలెట్టారు ఇద్దరు బురఖా వేసుకున్న స్త్రీలు.

వాళ్లు అడుక్కునే వాళ్లనిపించలేదు. తాము పోగొట్టుకున్న పర్సు నా చేతిలో చూసి లాక్కోడానికి దూసుకొచ్చినట్లనిపించింది.

చిరాకును బలవంతంగా అణుచుకుని, వాళ్ల మీదుగా చేయి చాపి, తన సీట్లోంచి ఛాలెంజింగ్‌గా చూస్తున్న డ్రైవరుకు డబ్బులిచ్చి, సీటు మీంచి రెండు బ్యాగులు విసురుగా లాక్కుని, అప్పటికే ఇటు వైపు వచ్చిన లక్ష్మికి "పద పోదా"మని మొరటుగా అర్డరేసి బస్టాండులోనికి నడిచాను.

జూన్ నెల మొదటి శనివారం సాయంత్రం. ఎంత రద్దీగా వుండాలో అంత రద్దీగా వుంది హైద్రాబాదు సెంట్రల్ బస్‌స్టేషన్. ఇంత అశాంత ప్రదేశాన్ని మహాత్మగాంధీ పేరిట పిలవడం ఇష్టంలేకనేమో, పాత పేరుతోనే ఇమ్లిబన్ అనే అంటారు చాల మంది. ఇమ్లిబన్ అంటే చింతచెట్ల వనం. ఆ అర్థం గుర్తు చేసుకుంటే నవ్వొస్తుంది. ఒక్క చెట్టూ లేదు.

"ఇగ మనకు బస్సులో సీటు దొరికినట్టే. రిజర్వు చేసుకుందామంటే ఒద్దంటివి" తెచ్చిపెట్టుకున్న శాంత స్వరంతో అన్నాను లక్ష్మితో. తన వైపు చూళ్లేదు.

"ఏం జెయ్యాల. అయినోల్ల ఇంట్లో ఫంక్షన్. అదెప్పటికయితాదో తెలదు. మధ్యలో వస్తే బాగుండదు. యా బస్సుకని రిజర్వు చేసుకుంటాం", విసుగ్గా గొణుగుతూ ముందుకు నడిచిందామె. రద్దీ చూశాక తన మాటల్లో కొంచం అపరాధ భావన చేరినట్టుంది.

ఆ సంగతి అంత కన్న పొడిగించి లక్ష్మిని బాధ పెట్టొద్దని ముందుకు నడిచాను. లేకుంటే ఫంక్షన్లు వున్నప్పుడు ప్రయాణాల్ని ఎలా ప్లాన్ చేసుకోవాలో తనకు క్లాసు పీకి ఆ కాస్త సామరస్యాన్ని చెడగొట్టుకునేవాణ్ని. ఇద్దరం గబగబా కర్నూలు బస్సులాగే చోటికి నడిచాం. అప్పుడే ఒక ఆర్డినరీ డొక్కు బస్సొచ్చి ఆగింది. జనం తోసుకుంటూ ఎక్కేశారు.

"అందరు దగ్గరి వూళ్లోల్లు...ఈ ఆర్డినరీ బస్సులు ఇట్నే వుంటాయి" అంది లక్ష్మి, నన్ను అనునయించడానికో తనను అనునయించుకోడానికో. పక్క ప్లాట్‌ఫాం మీద చిత్తూరు వెళ్లే హైటెక్ బస్సు ఆగి వుంది. లక్ష్మి మాట నిజమే. ఆ హైటెక్ బస్సు వద్ద అంత రద్దీ లేదు. డ్రైవరు బస్సు పక్కనే నుంచుని వున్నాడు. టిక్కెట్లిచ్చేది ఆయనే. భుజం మీది బ్యాగు సర్దుకుంటూ వెళ్లి "సార్, ఈ బస్సు కర్నూలు మీదుగా పోతుంది కదా..." అన్నాను. ఎక్కేదా అని బస్సు మెట్ల వైపు చూశాను. "పోతాది గాని, ఇంగ గంటన్నరగ్గాని కదలదు. అరగంటకు కర్నూలోల్ల హైటెక్కుంది" పొమ్మని నా నుంచి ముఖం తిప్పుకుని మరో వైపు చూశాడు.

జూన్ నెల మొదట్లో బస్టాండుల్లో రద్దీ వుంటుంది. అప్పుడు గాలిలో కూడా ఓ రకం రద్దీ వుంటుంది.

మూన్నెల్లపాటు మన వూపిరితో మనల్ని కాల్చి, మన చెమటలో మనల్ని

# వేటకుక్క

**"ఏం సార్,** మూడీగా వున్నారు...మీద ఎండ పడ్తోందా?"

ఆటోలో నవీన్‌కు మరింత స్థలం ఇవ్వడం కోసం కుడి పక్క మనిషివైపు సర్దుకోబోయి, ఆ మనిషి కోప్పడతాడేమోనని ఇబ్బందిగా ముఖం దించుకున్నాడు సుంకన్న.

"ఫర్లేదులే. ఇవన్నీ అలవాటే", తనకు అంత స్థలం అవసరం లేదన్నట్లు ఎడమ పక్కకు ఒదిగి ఆటో కడ్డీ పట్టుకున్నాడు నవీన్. వేడెక్కిన కడ్డీ చుర్రుమనిపించే సరికి చెయ్యి తీసి మళ్లీ ఒళ్లో సర్దుకున్నాడు.

సుంకన్న కుడి పక్క మనిషి వీళ్ల ఆపసోపాల్ని చూసి సానుభూతిగా నవ్వు మొహం పెట్టాడు.

మధ్యాహ్నం కావస్తోంది. ఆటోలో నీడగా ఉన్నా ఎండ వేడి తగుల్తోంది. చెమట చెమటగా చిరాగ్గా ఉంది.

బయటే కాదు నవీన్ మనస్సులో కూడా ఎండగానే వుంది. అతడి మనసులో ఏదో అశాంతి కదులుతోంది. ఏదో సొంత చిరాకు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kanipinchani+Cheyyi**

* * *